క్లుప్తంగా

అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: ఇటీవల రాజాంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన శేఖర్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. చీపురుపల్లికి చెందిన నజీర్, భాషా, రాహుల్, నితీష్ ప్రశాంత్,సోమనాథ్, ప్రణీత్ వివిధ విభాగాల్లో పతకాలు సాధించడంతో వీరిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తన కార్యాలయంలో శనివా రం అభినందించారు. విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు ,పతకాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి గోవింద, ప్రభాష్, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్నవారికే పని



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు, ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న వారే ఉపాధి పనులకు హాజరు కావాలని ఎంపీడీఓ జి.భాస్కరరావు అన్నారు. గొట్టుపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు.వేతనదారుల మస్టర్ల సీట్లను తనిఖీ చేశారు. ఈసం దర్భంగా వేతనదారులతో ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం రోజూ రెండు పూటలా పనులు చేయాలని చెప్పారు. ఒకరి పేరుమీద వేరొకరు పనులకు హాజరు కాకూడదన్నారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



జెండా ఊపి సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

దత్తిరాజేరు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపా రు.స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని గ్రామీణ నీటి సరఫరా విభాగం జేఈ కార్తిక్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 35 గ్రామపంచాయతీల్లో తాగునీటి హ్యాండ్ బోర్లకు మరమ్మతులు చేయించనున్నామని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించాలని సూచించారు.

తాగునీటి సరఫరా నిలిపివేత

గజపతినగరం: మండల కేంద్రంతో పాటు, ఎం.వెంకటాపురం గ్రామానికి ఆదివారం నుంచి రెండురోజుల పాటు తాగునీటి సరఫరా ఉండదని పంచాయతీ ఈఓ జనార్దనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎం.వెంకటాపురం గ్రామంలోని రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో తాగునీటి సరఫరా నిలిపి వేస్తున్నామని, మరమ్మతులు పూర్తయిన వెంటనే సరఫరా పునరుద్ధరణ చేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ ఆనందరావు

గంట్యాడ: రైతులంతా పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా చూడాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ ఆనందరావు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. వెలు గు సిబ్బంది, వీఓఏలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 9 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు చెప్పారు. మిగతా పంచాయతీల్లో కూడా రైతులు ప్రకృతి వ్యవసా యం చేసేలా చైతన్యవంతులను చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండవచ్చన్నారు. అలాగే ఇళ్ల వద్ద కిచెన్ గార్డెన్‌లు, కంపోస్ట్ పిట్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏపీఎం సులోచనాదేవి, తదితరులు పాల్గొన్నారు.



ఏరియా ఆస్పత్రిలో... ప్రసూతి కష్టాలు

- గణనీయంగా తగ్గిపోతున్న ప్రసవాల సంఖ్య
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న పేదలు
- వైద్యుల నిర్లక్ష్య ధోరణే కారణమా..?
- 2023 కంటే 2024 చివరిలో బాగా తగ్గిన ప్రసవాలు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో పెరుగుతున్న సంఖ్య

ఏరియా ఆస్పత్రిలో 2023 అక్టోబర్ నుంచి 2024 జనవరి నెల వరకు జరిగిన ప్రసవాల వివరాలు...

నెల	ప్రసవాలు	సాధారణ	సిజేరియన్
అక్టోబర్	48	36	12
నవంబర్	52	34	18
డిసెంబర్	52	37	15
జనవరి	53	36	17
మొత్తం	205	143	67

2024 అక్టోబర్ నుంచి 2025 జనవరి నెల వరకు జరిగిన ప్రసవాల వివరాలు...

నెల	ప్రసవాలు	సాధారణ	సిజేరియన్
అక్టోబర్	39	20	19
నవంబర్	30	09	21
డిసెంబర్	37	16	21
జనవరి	31	16	15
మొత్తం	137	61	76



రద్దీ లేని ఓపీ నమోదు కేంద్రం

చీపురుపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. వేల రూపాయలు వెచ్చించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం, ప్రసవాలు చేయించుకునే స్థోమత లేని పేద లు ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయి స్తుంటారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెంచేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరం గానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అందులో భాగంగానే 50 పడకల సామర్థ్యంతో ఉన్న స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల స్థాయికి పెంచి ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. భారీ సంఖ్యలో వైద్యులు, స్పెషలిస్టులు, స్టాఫ్ నర్సుల నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు నియ మించారు. దీంతో పేదలకు వైద్యసేవలు సక్రమంగా, సంతృప్తికర స్థాయిలో అందేవి. ప్రసవాలు కూడా ఇక్కడ ఎక్కువ సంఖ్యలోనే జరిగేవి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. గత ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణ యాల వల్ల ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో స్పెషలిస్ట్ వైద్యులు, తగిన సంఖ్యలో సిబ్బంది ఉన్నప్పటికీ వైద్య సేవలు మాత్రం రోజు రోజుకీ అందని ద్రాక్షలా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2024 జనవరి వరకు ఇక్కడి ఆస్పత్రిలో జరిగిన ప్రసవాలు, ఆ తర్వాత జరిగిన ప్రసవాల సంఖ్యే అందుకు నిదర్శనం. లక్షల రూపాయలు జీతాలు తీసుకునే వైద్య సిబ్బంది వైద్యం అందించడంలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండడంతో పేదలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించక తప్పడం లేదనే చర్చ జరుగుతోంది.

నాలుగు నెలల నుంచి తగ్గుతున్న ప్రసవాల సంఖ్య

ఏరియా ఆస్పత్రిలో గతంలో ప్రతి నెలా పెద్ద సంఖ్యలో ప్రసవాలు జరిగేవి. కానీ తాజాగా గత నాలుగు నెలల నుంచి ప్రసవాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2023 అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌తో పాటు 2024 జనవరి నెల లో జరిగిన సాధారణ, సిజేరియన్ ప్రసవాలు, 2024 అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌తో పాటు 2025 జనవరి నెలలో జరిగిన సాధారణ, సిజేరియన్ ప్రసవాల సంఖ్య చూస్తే ఇక్కడి పరిస్థితి ఎంతగా మారిపోయిందో అర్థమవుతోంది. 2023 అక్టోబర్ నుంచి 2024 జనవరి నెల వరకు 205 ప్రసవాలు జరిగాయి. అందులో సాధారణ 143, సిజేరియన్ ప్రసవాలు 67గా ఉన్నాయి. కానీ 2024 అక్టోబర్ నుంచి 2025 జనవరి నెల వరకు 137 ప్రసవాలే జరిగాయి. ఇందులో సాధారణ ప్రసవాలు 61 కాగా, సిజేరియన్ ప్రసవాలు 76 ఉండడం గమనార్హం. ఇక్కడ ప్రసూతి వైద్యం అందని పరిస్థితుల్లో పేదలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. ప్రసవాల కోసం ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని గ్రామీణ ప్రాంత పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ఆస్పత్రిలో ఉన్న వైద్యులే స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా ఓపీలు చూస్తుండడంతో అక్కడ ప్రసవాల సంఖ్య పెరిగిపోతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

అంగన్‌వాడీల వినతి



తహసీల్దార్ నీలకంఠరావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

లక్కవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ బి.నీలకంఠరావుకి శనివారం వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు మా ట్లాడుతూ ఎన్నికల సమ యంలో అంగన్‌వాడీలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ సిబ్బంది ఎక్కడ ధర్నా చేస్తే అక్కడికి కూటమి నాయకులు వచ్చి తమని గెలిపిస్తే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని, జీతాలు పెంచు తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణ హామీలను నెరవేర్చాలని కోరారు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రమణమ్మ,కె.వెంకటలక్ష్మి,గంగేశ్వరి,లక్ష్మి, తదితరులు పాల్గొ న్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

దత్తిరాజేరు: దాసుపేట గ్రామంలో మూడురోజుల పాటు వైభవంగా కొనసాగిన శ్రీ కోదండరామస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు శనివా రంతో ముగిశాయి. సింహాచలం దేవస్థానం అర్చకులు రేజేటీ శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషే కాలు, హోమాలు నిర్వహించారు. ముగింపు రోజున గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరై సీతారా ములను దర్శించుకున్నారు. వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరరావు, ఫణీంద్రుడు, సన్యాసిరావు పాల్గొన్నారు.

దళితులకు ఉచిత విద్యుత్ ఎక్కడ..?

వేపాడ: దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం గ్రామాల్లో దళితుల నుంచి బిల్లులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని దళిత ఉద్యమనేత ఆతవ ఉదయ్ భాస్కర్ నిలదీశారు. ఆతవ గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామంటూ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. 200 యూనిట్‌లు వాడని ఇళ్లకు కూడా ఎక్కువ మొత్తాల్లో బిల్లులు వస్తున్నాయని ఆరోపించారు. ఒక బల్బు, ఒక ఫ్యాన్ వినియోగించే ఇంటికి 200 యూనిట్ల విద్యుత్ కాలుతుందా అని ప్రశ్నించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

ఆ భూమిని అభివృద్ధి పనులకే వినియోగించాలి



తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన పెదనడిపల్లి గ్రామస్తులు

చీపురుపల్లి: పెదనడిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 78లో ఉన్న ప్రభుత్వ భూమిని అభి వృద్ధి పనులకు మాత్రమే వినియోగించాలని ఆ గ్రామ సర్పంచ్ ఎస్.పోలరాజు, మాజీ సర్పంచ్ పిసిని శ్రీను, మాజీ ఎంపీటీసీ సూరప్పుడు విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ ఎస్.రాజారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వే నంబర్ 78లో ఉన్న ప్రభుత్వ భూమిలో పాఠశాల, సచివాలయం , రైతు భరోసా కేంద్రాలను నిర్మించడంతో పాటు పేదలకు ఇళ్ల స్థలాలు కూడా కేటాయించారన్నారు. భవిష్యత్‌లో కూడా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకే ఆ భూమిని వినియోగించాలే తప్ప మరే ఇతర కేటాయింపులు చేయకూడదని కోరారు. ఆ భూమిలో కొంతమంది మాజీ సైనికులకు కేటాయింపులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీన్ని గ్రామస్తులంతా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



విద్యార్థినులతో ప్రాణాయామం సాధన చేయిస్తున్న కోటేశ్వరరావు

శృంగవరపుకోట: ధ్యానంతో ఒత్తిడిని అధిగమించవచ్చని స్థానిక మోక్షవిద్య యోగమందిర్ వ్యవస్థాపకుడు శీలా కోటేశ్వరరావు చెప్పారు. పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ప్రధాని మోదీ సూచనల మేరకు విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడిని అధిగమించేలా సంసిద్ధులను చేయడం కోసం స్థానిక ఏజీఎల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం ప్రాణాయామం, ధ్యానం తరగతులు నిర్వహించారు. యోగా శిక్షకుడు కోటేశ్వరరావు విద్యార్థులతో ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కాబోతున్న దృష్ట్యా పది రోజుల పాటు రోజూ అర్ధగంట పాటు విద్యార్థులతో ప్రాణాయామం సాధన చేయంచనున్నట్టు చెప్పారు.విద్యార్థులకు ఉచితంగా ప్రాణాయామం, ధ్యానం తరగతులు ఏర్పాటు చేయదలచిన ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు తమను సంప్రదిస్తే సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



వేపాడ: సోంపురంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగభూషణం



గజపతినగరం: పురిటిపెంటలో మాట్లాడుతున్న జీసీడీఓ మాలతి

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులంతా పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడంతో పాటు మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా ఉపా ధ్యాయులు కృషి చేయాలని జీసీడీఓ మాలతి అన్నారు. పురిటిపెంట బాలుర హైస్కూల్‌లో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గరపడుతున్నందున రోజూ స్పెషల్ క్లాసులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే అన్ని తరగతుల విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని ఏ-గ్రేడ్‌కు తీసుకురావాలన్నారు.స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ (స్థానిక హెచ్‌ఎం) ఎం.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

వేపాడ: మండలంలోని సోంపురం, వేపాడ ఉన్నత పాఠశాలల్లో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. సోంపురంలో సమావేశానికి ఎంఈఓ నాగభూ షణం, వేపాడలో సమావేశానికి ఎంఈఓ-2 బాలభాస్కరరావు హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. లెసన్ ప్లాన్ పూర్తిచేయడం, వచ్చే విద్యాసంవత్సరంలో స్కూళ్లలో పిల్లల సంఖ్య పెంచడం, ఏటీఎల్, పాఠశాలల్లో పరిశుభ్రత, మెనూ అమలు తదితర అంశాలను వివరించారు.

పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని, ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సూచించారు. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, గ్రామాల్లో శనివా రం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయాలు, విద్యాలయాల ప్రాంగణాల్లో, వీధుల్లో పరిసరాలను అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు శుభ్రం చేశారు. ప్రజలకు తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించే విధానంపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం, చెత్త సేకరణ బుట్టల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. – సాక్షి నెట్ వర్క్



వేపాడ: వేపాడలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న మండల అధికారులు



చీపురుపల్లి: చీపురుపల్లిలో ప్రజలకు చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సురేష్



శృంగవరపుకోట: ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్.కోట మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది, ఈఓపీఆర్డీ లక్ష్మి



శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు



కొత్తవలస: కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పోలీసులు



గంట్యాడ: గంట్యాడ పోలీస్ స్టేషన్ ఆవరణలో చెత్తను తొలిగిస్తున్న పోలీసులు



చీపురుపల్లి: చీపురుపల్లి పోలీస్ స్టేషన్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ దామోదరరావు



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్ చేస్తున్న విద్యార్థినులు



మెరకముడిదాం: మెరకముడిదాంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



గుర్ల: ఎంపీడీఓ కార్యాలయం వద్ద చెత్తను ఊడ్చుతున్న ఎంపీడీఓ వరప్రసాద్, అధికారులు



బొండపల్లి: బొండపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో గార్డెన్ పనుల్లో ఎస్ఐ మహేష్,పోలీస్ సిబ్బంది

ఉన్నత లక్ష్యంతో చదవాలి..



మాట్లాడుతున్న పద్మావతి

నెల్లిమర్ల: బాలికలు ఉన్నత లక్ష్యాలతో విద్యనభ్యసించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ బి. పద్మావతి సూచించారు. పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల గురించి విద్యా ర్థినులతో కాసేపు ముచ్చటించారు. ఏమైనా సమస్య ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమె వెంట డీఈఓ మాణిక్యం నాయుడు, సమగ్రశిక్ష ఏపీసీ రామారావు ఉన్నారు.

రామ మందిరానికి శంకుస్థాపన

విజయనగరం టౌన్: నగరంలోని ఫూల్‌బాగ్ పీజీ కళాశాల రోడ్డులో అయోధ్య బాలక్ రామమందిరానికి శనివారం శంకుస్థాపన చేశారు. అయోధ్య బాలక్ రామమందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమంలో విగ్రహదాత తోట సత్యనారాయణ దంపతులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, కట్టమూరి చంద్రశేఖర్, జి.సన్యాసినాయుడు, 2వ డివిజన్ కార్పొరేటర్ ఆనంద్ పాల్గొన్నారు.